
# పితృవాసన

మలయాళ మూలం: కమలా దాస్
అనువాదం: ఎల్.ఆర్.స్వామి




పేపరులో ప్రకటన చూసి చాలా ఆనందం కలిగింది ఆమెకు.

కలకత్తా వచ్చి ఒక వారంరోజులయిన తరువాత కనబడింది ఆ ప్రకటన. తమ వ్యాపారమంతా చూసుకోవటానికి తెలివి కలది, అందకత్తె అయిన ఒక యువతి కావాలనేది ఆ ప్రకటన యొక్క సారాంశం.

బట్టల రంగుల గురించి, కొత్త కొత్త డిజైన్ల గురించి కొంత తెలిసి వుండటం అభిలషనీయమని కూడా ప్రకటించారు. సొంత దస్తూరీతో రాసిన దరఖాస్తు పత్రాలు తీసుకొని అభ్యర్థులు నేరుగా ఆఫీసుకు వచ్చి కలవవచ్చునని కూడా ఆ ప్రకటనలో సూచించారు.

బాగా రద్దీగా వుండే వీధిలో వుండేది ఆ




ఆఫీసు భవనం. లేత పసుపు రంగు చీర కట్టుకొని తెల్లటి బేగు భుజానికి తగిలించుకొని ఆమె ఆఫీసు వద్దకు చేరినప్పుడు సమయం పదకొండు గంటలు దాటింది. రెండు వందలకు పైగా గదులు వుండేవి ఆ భవంతిలో. విశాలమైన వసారాలో జనసమ్మర్థం ఎక్కువగా ఉండేది. నాలుగు లిఫ్టులు పనిచేస్తున్నా ప్రతి లిఫ్టు వద్దా స్థూలకాయులైన వ్యాపారస్తులు బ్రీఫ్‌కేస్ పుచ్చుకున్న వ్యాపారస్తులు గుమిగూడి వుండటం గమనించింది ఆమె. కానీ ఆ గుంపులో ఒక్క స్త్రీ కూడా కనిపించకపోవటం ఆమెని ఆశ్చర్యప రచింది. ఆమె ధైర్యం కొంత నీరు కారిపోయింది కూడా. తన భర్త వద్దన్నా వినిపించుకోకుండా ఆ ఉద్యోగం కోసం స్వయంగా, రావటం పొరపాటైందే మోనని తోచింది ఆమెకు.

"టెక్స్‌టైల్ ఇండస్ట్రీ ఏ అంతస్తులో వుందండీ?" ఎదురుగా కనబడిన ఒక బంట్రోతును అడిగింది ఆమె.

"ఫస్టు ఫ్లోర్‌లోనే అనుకుంటున్నా" అతను, అన్నాడు.

ఆమె రెండడుగులు ముందుకు వేసింది. అందరి దృష్టి తన మీదే ఉన్నట్టు తోచింది ఆమెకు. రాకుండా వుండి వుంటే బాగుండేది అని మరోసారి అని పించింది. తనని అంటీ అంటనట్టు తనకు అతి దగ్గ రగా నిలబడి వున్న మగవాళ్ల మధ్య నిలబడిన ఆమెకు ఊపిరిపోతున్నట్టు తోచింది. పదివేలు యిచ్చినా, రోజూ ఆ ఆఫీసుకు వచ్చి పని చెయ్యటం తన వల్ల కాదని అనుకుంది. కానీ, ఎందుకో వెంటనే వెనక్కు వెళ్లలేకపోయింది.

ఎలాగోలాగ లిఫ్టులోకి దూరగలిగింది ఆమె. దగ్గ రగా నిలబడి ఉన్న మగవాళ్లకు తన శరీరం తగల కుండా అతి జాగ్రత్తగా ఒక మూలగా ఒదిగి నిలబ డింది.

ఫస్టు ఫ్లోరులో దిగి అటూ, యిటూ చూసింది. పెద్ద వసారా. వసారాలో వరుసగా గదులు. ఒకొక్క గది ముందు ఒకొక్క పెద్ద తలుపు– తలుపు పైన ఒక పెద్ద బోర్డు– అదీ దృశ్యం.

బోర్డులు చూసుకొని మెల్లిగా అడుగులు వేసింది. "ఎగుమతి, దిగుమతి మరియు ఫైన్ వ్యాపారం' బోర్డులే ఎక్కువగా,

కనబడ్డాయి. తను వెతికే బోర్డు ఆమెకు ఎక్కడా కనబడలేదు.

'టెక్స్‌టైల్ కంపెనీ ఎక్కడ వుందండీ' వెతికి, వెతికి అలసిపోయిన ఆమె ఒకతన్ని అడిగింది.

తన ఎర్రటి కళ్లతో ఆమెని నఖశిఖాంతం పరిశీ లించాడు, అతను. ఆ తరువాత అన్నాడు. "నాకు తెలియదు కాని నాతో వస్తే ఎవరినయినా కనుక్కొని చెప్తాను."

అతను చాలా పొట్టిగా వున్నాడు. మధ్య వయ స్కుడు. కళ్లు చిన్నవిగా వున్నాయి. వేళ్ళ నఖాలలో మట్టి కూరుకుపోయింది. అది చూసి ఆమెకు అత నితో వెళ్లాలనిపించలేదు.

"నేను కనుక్కుంటానులెండి."

గబగబ అడుగులు వేసింది. వసారాలో ఒక మూలనుంచి మరో మూలదాకా వెతికింది. మలుపు తిరిగింది. అక్కడ కూడా తలుపులు వేసి వున్నాయి. కొందరిని అడిగింది. తను వెళ్లవలసిన ఆఫీసు గురించి ఎవ్వరూ చెప్పలేకపోయారు.

వసారా చివర ఒక గది తలుపు పైన 'డైయింగ్' అనే బోర్డు చూసి ఆగింది, ఆమె. –ఆమెకు నవ్వు వచ్చింది. ఆ గదిలో జరిగే వ్యాపారం బట్టలకు రంగు వెయ్యటమా, లేక మరణం ఏర్పాటు చెయ్యటమా, అనే అనుమానం వచ్చింది. అడిగి తెలుసుకోవచ్చు కదా అనుకొని మెల్లిగా తలుపు తోసింది.

తలుపు తెరచుకుంది లోపల పెద్ద హాలు – ఆ హాలులో రెండో, మూడో కుర్చీలు– ఒక పెద్ద బల్ల – అంతే. బంట్రోతు కానీ, ఉద్యోగస్తులు గానీ కనబడ లేదు.

"ఇక్కడ ఎవ్వరూ లేరా?" ఆమె గట్టిగా అడి గింది.

ఏ జవాబూ రాలేదు. లోపల గది తలుపులకు వేసిన తెరలు ఒక్కసారి కదిలాయి, అంతే. వెనక్కు తిరిగింది, ఆమె. అడుగులు తడబడ్డాయి. కొంత విశ్ర మించనిదే, ముందుకు సాగలేనని తోచింది, ఆమెకు. ధైర్యం తెచ్చుకొని హాలు మధ్య వున్న కుర్చీలో కూల బడింది.

ఒక నిముషం కూర్చుంటే నీరసం తీరుతుంది. ఎవరైనా రావచ్చును. తను వెతికే ఆఫీసు గురించి వచ్చిన వారికి తెలుసేమో!

కర్చీఫ్‌తో మోము ఒత్తుకుంది. చేతి సంచీ తెరచి, చిన్న అద్దం ఒకటి బయటకు తీసింది. పౌడర్ ముఖా నికి అద్దుకుంది. ముంగురులని సవరించుకుంది. అద్దం అటూ, యిటూ జరిపి చూసుకుని, తనది చూడముచ్చటైన మోమేనని అనుకుని సంతృప్తి పొంది. కుర్చీ వెనక్కు తల వాల్చింది.

ఫేను తిరుగుతూనే వుంది. అలసిపోయిన ఆమె కళ్లు మూతలుపడ్డాయి.

సీసా తెరిచే శబ్దానికి ఆమె ఉలిక్కిపడి లేచింది. కళ్లు నులుముకుంది, అపరిచితమైన చోట కూర్చుని నిద్రపోయినందుకు తనలో తనే తిట్టుకొని గబగబా లేచి చుట్టూ చూసింది, ఆమె. అప్పుడు కనబడ్డాడు, అతడు. తన ఎదురుగా కుర్చీలో కూర్చుని విస్కీలో సోడా కలుపుకుంటూ... ఒక యువకుడు. వెన్న రంగులో వున్న టెరిలిన్ చొక్కా తొడుక్కున్నాడు, అతడు. సోడా పోస్తున్న అతని చెయ్యి చాలా బలి ష్టంగా కనబడింది. ఆ చేతి వేళ్లలో గూడా, గుబు రుగా పెరిగివున్న రోమాలు చూసి ఆమె కంగారు పడింది.

అతను తల ఎత్తి ఆమెని చూసాడు. అతని మోము గుర్రం మూతిలా కనబడింది, ఆమెకు.

"బాగా నిద్రపోయావా" అతను అడిగాడు. జవాబు కోసం ఎదురు చూడలేదు, అతను గ్లాసు లోని పానీయాన్ని ఒక్క గుటకలో తాగేసాడు.

"నీకు దాహంగా వుందా"..అతను, అడిగాడు.

ఆమె ఏమీ జవాబు చెప్పలేదు. కానీ అడిగింది 'టెక్స్‌టయిల్' కంపెనీ ఎక్కడ వుందో మీకు తెలుసా?"

అతను ఏమీ అనలేదు.

"మీకు తెలుసేమోనని నాకు అనిపిస్తోంది" ఆమె మళ్లీ అంది.

"ఎందుకంటే మీరు బట్టలకు రంగులు వేస్తు న్నారు కదా.." ఆమె తప్పనిసరిగా నవ్వింది.

అతను నవ్వలేదు. గ్లాసులోకి విస్కీ పోసుకు న్నాడు. సోడా కలుపుకున్నాడు. మాటలాడటానికి యింకా టయిమ్ వుందిలే అన్నట్టు ప్రవర్తించాడు.

"మీకు తెలియదా?" ఆమె గట్టిగా అడిగింది సహనం కోల్పోయినట్టు.

టెక్స్‌టయిల్ కంపెనీ కనపడకపోయినా, యిల్లు చేరితే మంచిదని లేచింది.

హఠాత్తుగా నవ్వాడు అతను. అతని సన్నటి పెద వులు వికృతంగా మారాయి. "ఎందుకు అంత తొందర?" అతను అన్నాడు. "టయిం యింకా పన్నెండు కాలేదు.."

ఆ మాటలు ఆమె పట్టించుకోలేదు. తలుపు వద్దకు నడుస్తూ అంది మళ్లీ. "కంపెనీ గురించి మీకు తెల్సివుంటుందని, అనుకున్నాను. బట్టల వ్యాపా రంతో మీకు సంబంధం వుంది కదా?"

"మాకేమిటి సంబంధం?" అతను రెట్టించాడు.

"బయట బోర్డు వుంది కదా.. డైయింగ్ అని.."

అతను ఫెళ్లున నవ్వాడు.

"మీరు బోర్డు సరిగ్గా చూడలేదు. మేము బట్ట లకు రంగులు వేసేవాళ్లం కాదు.."

"మరి!?"

"డైయింగ్ కి అర్థం ఏమిటి? చావు. అదే చావు. సుఖంగా మరణాన్ని ఏర్పాటు చేసేవాళ్ళం మేము.

కుర్చీలో వెనక్కి వాలేడు అతడు. ఆమెని చూసి ముసి ముసిగా నవ్వాడు. అతని నవ్వు తన కళ్లలోకి

పాకినట్టు తోచింది ఆమెకు.

ఆమె కాళ్లు ఒణికాయి. అయినా తలుపు వద్దకు పరుగెత్తింది. అలసిపోయిన ఆమె తలుపులు తెరవలేకపోయింది.

''మీకు పుణ్యం వుంటుంది.'' ఆమె కళ్లు అప్పటికే కన్నీళ్లతో నిండిపోయాయి. ''దయచేసి తలుపులు తియ్యండి.'' ఆమె ప్రాధేయ పడింది. ''నేను యింటికి వెళ్ళాలి. నా పిల్లలు ఎదురు చూస్తూ వుంటారు.'' తన కన్నీళ్ళకు, మాటలకు అతని హృదయం కరిగిపోతుందని, అతను క్రూర ఆలోచనలు ఒదిలి తలుపు తెరుస్తాడని ఆశించింది.

అతను కదలలేదు. మళ్ళీ, మళ్ళీ విస్కీ తాగేడు. మళ్ళీ, మళ్ళీ ఆమె వైపు తిరిగి నవ్వాడు.

''నేనేం పాపం చేసానండీ.'' తిరిగి మళ్లీ తలుపు తీయడానికి ప్రయత్నిస్తూ అడిగింది, ఆమె. ''నన్ను వెళ్ళనివ్వండి. నన్ను వంచించకండి.''

అలసిపోయిన ఆమె తలుపువారగా, నేల మీదకు ఒరిగిపోయింది.

అతను ఏదో మాట్లాడుతూనే వున్నాడు. స్పృహ వుండీ, లేని మైకంలో కొన్ని మాటలు వినబడ్డాయి ఆమెకు.

''అప్పుడెప్పుడో ఒక చలి కాలంలో ఒక పిట్ట ఎగిరి వచ్చి నా పడక గదిలో వాలింది. పసుపు, ఊదా కలిసిన రంగు దానిది- అదే నీ చీర రంగే. అది కిటికీ ఊచలని ముక్కుతో పొడిచి చూసింది. రెక్కలతో గాజు తలుపులని విరగ గొట్టటానికి ప్రయత్నించింది. కానీ ఏం ప్రయోజనం! అలసిపోయి, నేలకు రాలింది, అంతే. నేను దాన్ని నా షూతో నలిపి పారేసాను.''

కొన్ని నిముషాలు అతను మౌనంగా వుండిపోయాడు. ఆ తర్వాత అడిగాడు. ''నీకు తెలుసా మరణ వాసన ఎలా వుంటుందని?''

ఆమె మెల్లిగా కళ్ళు తెరచి అతన్ని చూసింది. ఏదో చెప్పాలని అనుకుంది. కాని పెదవి పెగల లేదు. మరణ వాసన కాదు, కాదు మరణము యొక్క వివిధ వాసనలు తనకన్నా ఎక్కువ ఎవరికి తెలుసు రసికారే వ్రణాల వాసన - పళ్ళ తోటల మధుర సుగంధం ఊదొత్తుల సుగంధం- అన్నీ మరణ వాసనలే.

ఇరుకైన చీకటి గదిలో నేలపై వేసిన చాప మీద పడుకొని ఏడుస్తూనే వుండేది తన తల్లి.

''నా వల్ల కాదు. కాదు. నాకు శక్తి లేదు.''

తల్లి కాళ్ళ పై వుండే వ్రణాలలో తెల్ల పురుగులు కదులుతూ వుండేవి. అయినా అమ్మ చెప్తూ వుండేది ''నొప్పిలేదులే'' అని.

ఆ తరువాత ప్రమేహ రోగి యైన తండ్రి హఠాత్తుగా నేల మీదకు ఒరిగినప్పుడు పళ్ళ తోటలో నుంచి, చిరుగాలి వీచినట్లు తోచింది. ఆమెకు గది అంతా తియ్య, తియ్యటి వాసన అదీ మరణ వాసనయే.

అవన్నీ చెప్పాలని తోచింది ఆమెకు. కానీ, పెదవి పెగల లేదు. నాలిక ఎండిపోయి వుండేది.

అతను ఏవేవో చెప్తూనే వున్నాడు.

''నీకు తెలియదు. నేను చెప్తాను. చావుకి తూనీగల వాసన వుంటుంది. నీకు తొందరలోనే అది తెలుస్తుందిలే. పోనీ నీకు యిప్పుడే అది తెలుసుకోవాలని వుందా? నీకిష్టమైన సమయం చెప్పు అప్పుడే చావొచ్చులే. పై నుంచి చూసే సూర్యుని కింద సిగ్గులేకుండా ఈలోకం పడుకునే సమయం నీకు యిష్టమా? కాదు. సాయం సంధ్యయా? చెప్పు. నీకిష్టమయిన సమయం చెప్పు. నీవు ధైర్యవంతురాలివి కదా! చెప్పు.'' అతను చెప్తూనే వున్నాడు.

మెల్లగా కుర్చీ నుంచి లేచాడు, అతను. ఆమెని సమీపించాడు అతను చాలా ఎత్తుగా కనబడ్డాడు, ఆమెకు.

''మీకు పుణ్యం వుంటుంది.'' ఆమె మళ్లీ వేడుకుంది. ''నన్ను వెళ్ళనివ్వండి. ఇక్కడికి రావాలని నేను అనుకోలేదు.''

''అబద్ధం ఆడకు.'' అతను గట్టిగా అన్నాడు. ''ఇక్కడికి రావాలని నువ్వెన్నిసార్లు అనుకోలేదు? సుఖమయమైన మరణం గురించి నువ్వెన్నిసార్లు ప్రార్థించలేదు! నాకు తెలుసు- నిట్టూర్చే కడలిలో ఆలస్యంగా అయినా కలవాలని కోరుకునే మృదుల తరంగాల వాడి కదా, నీవు.''

ఆమె లేచి కూర్చుంది. అతని వేళ్ళకు ఒక భయంకర ఆకర్షణ ఉన్నట్టు తోచింది, ఆమెకు.

''నన్ను ఎప్పుడూ చూడలేదా?'' అతను, అడిగాడు.

''లేదు..''

''నీ వద్దకు నేను చాలాసార్లు వచ్చాను. ఒకసారి ఒచ్చినపుడు నీకు పదకొండేళ్ళే. పచ్చ కామెర్లతో పడివున్నావు, అప్పుడు. ఆ రోజు మీ అమ్మ కిటికీ రెక్కలు విప్పగానే నువ్వన్నావు, నీకు పసుపురంగు పువ్వులు కనపడుతున్నాయని. అన్ని పూలు నీకు పసుపు రంగులోనే కనబడ్డాయి, గుర్తుందా?''

ఆమె గుర్తున్నట్టు తల వూపింది.

''నీకు మాత్రం కనబడిన పసుపు రంగుపూల మధ్య నేను నిలబడి వున్నాను. అప్పుడు నీ చేతులు అందుకుని నిన్ను చేర్చవలసిన చోట చేర్చాలని అనుకున్నాను. కానీ, నువ్వు రాలేదు. నా స్నేహం గురించి నా ఆప్యాయత గురించి నీకు తెలియలేదు. నేను దారి చూపుతానని అనుకోలేదు నువ్వు. నువ్వే కాదు. అందరికీ మార్గదర్శకుడిని, నేనేనని తెలుసుకోలేకపోయావు.

''స్నేహమా.. ఆప్యాయతా.. ఇలా బంధించటం స్నేహమా?'' ఆమె అడిగింది.

''పరిపూర్ణ స్నేహమంటే ఏమిటని చూపగలిగిన వాడిని నేనొక్కడినే అని నాకు తెలుసు. ఒక్కొక్కటిగా నీవు నా కన్నీ అందిస్తావని- నీ ఎర్రటి పెదవులు, కదిలే కనుపాపలు, అందమైన నీ శరీరం - అన్నీ, అన్నీ చివరికి నువ్వెంతో ప్రేమగా పెంచుకుంటున్న ఉంగరాల ముంగురులు కూడా- అన్నీ నాకు కానుకగా యిస్తావు. నీకంటూ ఏమీ మిగలదు, ఆ కానుకకు ప్రతిఫలంగా నేను నీకు స్వాతంత్ర్యం ప్రసాదిస్తాను. నీవు ఏమీ లేని దానివైపోతానని అనుకుంటున్నావేమో గానీ అంతా నీవే వుంటావు. కడలి గర్భంలో నువ్వుంటావు. తొలకరికి చిగురించే కొత్త చిగుళ్ళలో కూడా వుంటావు. మట్టి కిందపడి పురిటి నొప్పులు పడే విత్తనం ఏడుస్తూ వుంటే నీ ఏడుపు కూడా దానితో కలిసిపోతుంది. నువ్వు గాలివి అవుతావు, వాన చినుకు కూడా అవుతావు. ఈ ప్రపంచ సౌందర్యమవుతావు.''

ఆమె లేచినిలబడింది. తన అలసట మాయమైపోయినట్టు తోచింది, ఆమెకు. కొత్తగా సంతరించుకున్న ధైర్యం ఆమెచేత పలికించింది. ''ఇవన్నీ నిజం కావచ్చు కానీ మీరు పొరబడుతున్నారు. మీరు అనుకుంటున్న మనిషి పేరు, నేను కాదు. నాకింకా చనిపోయే సమయం రాలేదు. నాకు ఇరువయి ఏడేళ్ళే. పెళ్ళయిన దాన్ని, తల్లిని ఉద్యోగం కోసం వెతుక్కుంటూ వచ్చినదాన్ని, నేను వెళ్ళాలి. ఒంటి గంట దాటిపోతోంది. తలుపు తీయండి, మీకు పుణ్యం వుంటుంది.''

అతను ఏమీ అనలేదు. తలుపు తెరిచాడు.

బయటకు వచ్చింది ఆమె లిఫ్టు దగ్గరకి గబగబా నడచింది. తన అడుగుల సవ్వడికి భయం వేసింది, ఆమెకు.

లిఫ్టులో లిఫ్టు నడిపేవాడు కనబడలేదు. బనాలోనికి వెళ్లి స్విచ్ నొక్కింది. ఏదో పగిలిపోయిన శబ్దంతో లిఫ్టు పైకి లేచింది. తను ఆకాశంలో వున్నట్టు, ఉరుములు వురుముతున్నట్టు అనిపించింది, ఆమెకు. కంగారుగా చూసింది. అప్పుడు కనబడింది ఆ బోర్డు. 'ప్రమాదం- లిఫ్టు పని చేయటం లేదు.'

చుట్టూ చీకటి- గర్జించే చీకటి-గోల చేసే చీకటి.

ఆ చీకటి నుంచి బయటపడే అవకాశం కుదరలేదు, ఆమెకు.

★

